క్లుప్తంగా

గ్రీన్ మాచర్లకు ప్రత్యేక చర్యలు

కమిషనర్ డి.వేణుబాబు



మాచర్ల : పట్టణంలోని ఐదు ప్రాంతాల్లో ప్రజల సౌకర్యార్థం రూ.61 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలకు గ్రాంట్‌లు మంజూరు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు తెలిపారు. ఆయన కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో పరిశుభ్రతకు సంబంధించిన అంశాలపై మాట్లాడారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతం, మున్సిపల్ కార్యాలయం ఎదురు, రింగ్‌రోడ్డు, నెహ్రూనగర్ తదితర ప్రాంతాల్లో మరుగుదొడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. కొమ్మాల కాలువ శుభ్రతలో భాగంగా మున్సిపల్ సిబ్బందిని కేటాయించి చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. ప్రజలను చైతన్య పరిచి మాచర్లను గ్రీన్ మాచర్లగా మార్చడానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

డ్వాక్రా గ్రూపుల నమోదు 91 శాతం పూర్తి

మెప్మా ప్రాజెక్టు ఇన్‌చార్జి మేనేజర్ రాజశేఖర్



మాచర్ల : ప్రతి డ్వాక్రా గ్రూపుల సభ్యుల వివరాలు ఆన్‌లైన్ నమోదులో భాగంగా పట్టణంలో ఇప్పటి వరకు 91 శాతం పూర్తయినట్లు పట్టణ మెప్మా ప్రాజెక్టు ఇన్‌చార్జి మేనేజర్ రాజశేఖర్ శుక్రవారం తెలిపారు.

పట్టణంలోని మెప్మా ప్రాజెక్టు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రిసోర్స్ పర్సన్‌ల ద్వారా గ్రూపు వివరాలు, బ్యాంకు రుణాలు, లావాదేవీలు, పెండింగ్ బకాయిలు తదితర వివరాలు నమోదు చేసినట్లు వెల్లడించారు. తొమ్మిది శాతం నమోదు చేయాల్సి ఉందన్నారు. ఆ వివరాలు పూర్తి చేయడం జరుగుతోందన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న గ్రూపులకు రానున్న రోజుల్లో ప్రభుత్వం మైక్రో స్నాక్స్, చిన్న, మధ్యతరగతి షాపులు ఏర్పాటు చేసుకునేందుకు లబ్ధి చేకూర్చడం జరుగుతుందన్నారు. ప్రతి గ్రూపు సభ్యులు పథకానికి సంబంధించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఇతర వివరాలకు మెప్మా ప్రాజెక్టు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

సహాయకురాలి పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

సీడీపీఓ సరళ

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న 6 సహాయకురాలి పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ బి.సరళ, సూపర్ వైజర్ వై. శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను డిసెంబర్ 18 సాయంత్రం 5 గంటల లోపు మాచర్ల ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని కోరారు.

గురజాల: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ నోటిఫికేషన్‌ను శుక్రవారం విడుదల చేశారు. గురజాల ప్రాజెక్టు పరిధిలో గురజాల మండలంలో ఇందిరాకాలనీలోని సెంటర్‌కు అంగన్‌వాడీ కార్యకర్త, దాచేపల్లి మండలంలోని ముత్యాలంపాడు, రామాపురం గ్రామాల్లోని కేంద్రంలో ఆయాలు, గురజాల మండలంలోని కొత్త అంబాపురం గ్రామంలో ఆయా పోస్టుల ఖాళీలు భర్తీ చేయడం జరుగుతుందని సీడీపీవో షేక్ రుక్సానా సుల్తానా బేగం తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు గురజాలలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నేడు పేరెంట్, టీచర్స్ మెగా సమావేశం

మాచర్ల: మండలంలోని ఏడో మైలు, పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, రెంటచింతల మండలంలోని రెంటచింతలలో వైఎస్సార్ హైస్కూల్‌లో ఈ నెల 7న జరిగే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశానికి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హాజరు కానున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు.

అంబేడ్కర్ చిరస్మరణీయుడు



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మేరాజ్యోత్ హనుమంతునాయక్, సుందరరావు



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్సై సంధ్యారాణి



పిడుగురాళ్ల పోలీస్ స్టేషన్ సెంటర్‌లో... అంబేడ్కర్ వర్ధంతి

వాడవాడలా ఘనంగా అంబేడ్కర్ వర్ధంతి

మాచర్ల : ప్రపంచ దేశాల్లో అత్యుత్తమమైన రాజ్యాంగాన్ని మన దేశానికి అందించిన డాక్టర్ అంబేడ్కర్ చిరస్మరణీయుడని వైఎస్సార్‌సీపీ మాజీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు మేరాజ్యోత్ హనుమంతునాయక్, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ మాచర్ల సుందరరావులు అన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని మాచర్ల పట్టణంలోని అంబేడ్కర్ పార్కులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అణగారిన వర్గాల ఆర్థిక, సామాజిక సాధికారత కోసం అంబేడ్కర్ పోరాటం మరువలేనిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్టీ నాయకులు ఎం.స్వతంత్ర నాయక్, ఎం.బిల్లునాయక్, బాణావత్ రామ్‌నాయక్, మణికంఠ, సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వివిధ సంఘాల ఆధ్వర్యంలో

దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్), జగజ్జీవన్‌రామ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ పార్కులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అర్బన్ ఎస్సై సంధ్యారాణి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాటం చేసిన పోరాట యోధుడు అంబేడ్కర్ అన్నారు. చర్మకారుల మాజీ అధ్యక్షుడు కందుల రవి, డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కుక్కమోడి ప్రసాద్, బీసీ మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు కె.జ్యోతి, ఎంసీపీఎం నాయకులు మాచవరపు నాగేశ్వరరావు, బీజేపీ ఎస్సీ నాయకులు రవికుమార్, పలు ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ అంటరానితనం రూపుమాపేందుకు అంబేడ్కర్ కృషి కొనియాడదగినదన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలి

పిడుగురాళ్ల: అంబేడ్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాలని పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు తెలిపారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ప్రచార సేవా సమితి అధ్యక్షులు దేగల అబ్రహాం, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాణంలో అంబేడ్కర్ కృషి మరువలేనిదని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రతినిధి వర్లా అగస్టీన్, జిల్లా మహిళా అధ్యక్షులు దేవరకొండ సుశీల, గురజాల నియోజకవర్గ ఇన్‌చార్జి మీసాల బాబు, పట్టణ అధ్యక్షులు ఇజ్రాయేల్, మహిళా అధ్యక్షురాలు వడ్లమూడి కోటేశ్వరి, ఎస్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా నాయకులు బోడేపూడ శివ, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, అగస్టీన్, చిన్న, రమేష్, సురేంద్ర, మరియదాసు, నాగరాజు, రమేష్, పున్నారావు, జాషువా, వెంకటేష్, రవి, ప్రకాష్, శ్రీను పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు కొనసాగించాలి

దాచేపల్లి : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు సాధించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ షేక్ సుభానీ అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం నారాయణపురంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వలన దేశంలో బలహీన వర్గాల వారు రాజ్యాధికారం దిశగా అడుగులు వేస్తున్నారని, బడుగుల అభ్యున్నతికి అంబేడ్కర్ ఎంతో కృషి చేశారని సుభానీ చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కోట కృష్ణ, పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొప్పుల సాంబయ్య, నాయకులు కౌమెరబత్తిన విజయ్‌కుమార్, కొలా జంపాల రెడ్డి, దాచేపల్లి సైదారావు, మేడి సుగుణరావు, జంగాల సింగరయ్యయాదవ్, కనమర్లపూడి గోపి, మండ్లేం రామారావు, మునగా శ్రీనివాసరావు, నాశం శ్రీనివాసరావు, నెల్లూరి కోటేశ్వరరావు, వేముల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్

విజయపురిసౌత్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని విజయపురిసౌత్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించినట్లు తెలిపారు. స్థానిక పీటీజీ బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ శామ్యూల్ జాన్ మాట్లాడుతూ అంబేడ్కర్ కుల వివక్షకు వ్యతిరేకంగా గళం విప్పిన మహనీయుడని, బడుగు బలహీన వర్గాలకు ఆత్మగౌరవాన్ని ప్రసాదించిన రాజ్యాంగ రూపకర్త అని కొనియాడారు. దీనికి ముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక మాల మహానాడు అధ్యక్షుడు బొబ్బిలి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు గుంటి ఆంద్రూస్ బాబు, కె.నాగేంద్రబాబు, సత్తిబాబు, స్థానిక జనసేన అధ్యక్షుడు రాహుల్, చరణ్‌బాబు, బీఅండ్‌ఆర్ ప్రసాద్, పత్తి రామచంద్రరావు, చింతమళ్ళ శ్రీను, జ్యోతి నారాయణ, బాలస్వామి, నూకరాజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

వెల్దుర్తి: భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న అంబేడ్కర్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మార్పీఎస్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ అధ్యక్షుడు ఆదిరాల సురేష్ అన్నారు. వెల్దుర్తిలోని దళితవాడ మండల పరిషత్ పాఠశాలలో శుక్రవారం వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ వర్ధంతిని ప్రపంచ వ్యాప్తంగా జరుపుకోవటం సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, విద్యా కమిటీ చైర్మన్ ఆదిరాల సామేలు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదిరాల యర్రయ్య, యోహాను, హనుమయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాచవరం: మండలంలోని పలు గ్రామాల్లో భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అంబేడ్కర్ చిత్రపటాలకు, విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను కీర్తించారు. ప్రపంచ మేధావిగా, దీనజన ఉద్ధారకుడిగా, మహిళల హక్కుల సాధనకై ఆయన చేసిన పోరాటాలు మరువలేనివని కొనియాడారు. ఆయా గ్రామాల అంబేడ్కర్ యూత్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



వెల్దుర్తి దళితవాడ మండల పరిషత్ పాఠశాలలో...



విజయపురిసౌత్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



నారాయణపురం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతి

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



మాట్లాడుతున్న తహసీల్దార్ కెనగేష్



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ బత్తుల వాణి



తంగెడలో రెవెన్యూ సదస్సు

వినతిపత్రాలు అందించిన రైతులు

45 రోజుల్లో సమస్య పరిష్కారం

రెంటచింతల: గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకే క్షేత్ర స్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల నోడల్ అధికారి ఎం.వెంకట రమణ అన్నారు. శుక్రవారం మండలంలోని మల్లవరం గ్రామంలో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. భూములకు సంబంధించిన సమస్యలపై ప్రజలు అర్జీలు ఇచ్చిన 45 రోజులలో పరిష్కరించడం జరుగుతుందన్నారు. గ్రామస్తులు 9 అర్జీలు అందజేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ పిన్నెం బ్రహ్మయ్య తెలిపారు. ఈ సదస్సులో ఆర్‌ఐ పల్లా రామకృష్ణ, ఈఓ. గాదె రామిరెడ్డి, వీఆర్వో పగడాల పాపారావు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి

దాచేపల్లి : ఏళ్ల తరబడి తాము సాగు చేసుకుంటున్న భూములపై ఉన్న సమస్యలు తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. మండలంలోని తంగెడ గ్రామంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో బాధిత రైతులు రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. గ్రామంలో నెలకొన్న భూ సమస్యలపై 42 వినతిపత్రాలు అందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వైవీ కుటుంబరావు చెప్పారు. ఈ సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ రాజు, సర్వేయర్ శ్రీనివాసరావు, స్థానిక నాయకులు చింతపల్లి హస్సన్‌అహ్మద్, షేక్ జానీబాషా తదితరులు పాల్గొన్నారు.

గొట్టిముక్కల సదస్సులో 12 అర్జీలు

గురజాల రూరల్ (గొట్టిముక్కల) : మండల పరిధిలోని గొట్టిముక్కల గ్రామంలో రెవెన్యూ సదస్సును శుక్రవారం ప్రారంభించారు.

ఈ సదస్సులో రెవెన్యూ అధికారులకు భూమి సమాచారం కొరకు-1, 22ఏ లిస్టు నుంచి తొలగించాలని-1, ఎఫ్ లైన్ సర్వే కొరకు-4, పాస్ పుస్తకం కొరకు-6 అర్జీలు మొత్తం 12 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ కె.నగేష్ తెలిపారు. రెవెన్యూ పరమైన సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా ఆయన అన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు దుగ్గరాజు శ్రీనివాసరావు, ఆర్‌ఐ శ్రీనివాసరావు, కూటమి నాయకులున్నారు.

గ్రామ స్థాయిలో సమస్యల పరిష్కారమే లక్ష్యం

మాచర్ల రూరల్: గ్రామ స్థాయిలో అన్ని భూముల సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో గ్రామ స్థాయిలో అన్ని శాఖల అధికారులతో రెవెన్యూ సదస్సును ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ బత్తుల వాణి తెలిపారు. శుక్రవారం మండలంలోని గన్నవరం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె రైతులనుద్దేశించి మాట్లాడారు. రెవెన్యూ అధికారుల బృందం ప్రతి గ్రామాన్ని సందర్శించి రెవెన్యూ సంబంధిత అంశాలైన మ్యుటేషన్, ఎల్‌ఈసీ కార్డుల మంజూరు, భూ తగాదాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణ, 22ఏ తారుమారు తదితర సమస్యలపై అర్జీలు తీసుకొని వాటిని ఉన్నతాధికారులకు నివేదించి నిర్ణీత సమయంలో పరిష్కారం చేయనున్నట్లు చెప్పారు. ఈ సదస్సులో 7 అర్జీలు అందినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈఓ సాంబశివరావు, ఆర్‌ఐ గన్నెబోయిన భాస్కర్, వీఆర్‌ఓ అనిల్, పంచాయతీ కార్యదర్శి, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన యాత్రలతో విద్యార్థులకు ఎంతో మేలు

సత్రశాల(రెంటచింతల): విజ్ఞాన యాత్రల ద్వారా విద్యార్థులు తమ మేధా సంపత్తిని పెంపొందించుకోవచ్చని ఏపీ జెన్‌కో నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఏఈ మల్లేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని జెట్టిపాలెం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు ఐటీ అండ్ ఐటీఈఎస్ సేవలపై అవగాహన కల్పించడంలో భాగంగా సత్రశాల వద్ద నున్న నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పాదనపై ప్రాజెక్టు ఏఈ మల్లేష్ అవగాహన కల్పించి మాట్లాడారు. ఏపీ జెన్‌కోలో విద్యుత్ ఉత్పత్తి ఎలా జరుగుతుందో విద్యుత్ ఉత్పత్తి రంగంలో కంప్యూటర్ పరిజ్ఞానం ఏవిధంగా ఉపయోగపడుతుందో వివరించారు.

భవిష్యత్ అంతా కంప్యూటర్‌తో ముడిపడి ఉందని ఇప్పటికే అనేక రంగాలలో కంప్యూటర్ కీలకపాత్ర పోషిస్తోందని అన్నారు. ప్రాజెక్టులో ఎంసీఆర్(మెయిన్ కంట్రోల్ రూమ్) పని చేసే విధానం, రెండు యూనిట్లు(టర్బయిన్లు) ద్వారా విద్యుత్ ఉత్పత్తి ఎలా తయారు చేస్తారు, టేల్‌రేస్ చానల్ ద్వారా నీటిని ఎలా విడుదల చేస్తారు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ కె.పాపయ్య, ఐటీ అండ్ ఐటీఈఎస్ వృత్తి విద్య జిల్లా సమన్వయకర్త అయ్యప్ప స్వామి, ఆటోమోటివ్ ఇంజనీరింగ్ టీచర్ వి.స్వప్న, ఉపాధ్యాయులు రేణుకాదేవి, శ్రీను, వెంకట్, విద్యార్థులు పాల్గొన్నారు.



టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు వద్ద ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

పిడుగురాళ్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మధుబాబు శుక్రవారం తెలిపారు. మండలంలోని ఈ నెల 10వ తేదీన కామేపల్లి, బ్రాహ్మణపల్లి 12న కరాలపాడు, చెన్నాయిపాలెం, 17న జూలకల్లు, పందిటివారిపాలెం, 19న గుత్తికొండ 1, 2 సచివాలయాల్లో, 21న తుమ్మలచెరువు, వీరాపురం, 24న కోనంకి, పాతగణేశునిపాడు, 26న పెద అగ్రహారం గ్రామాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని గ్రామ సచివాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సదస్సులు నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

ట్రోఫీతో విజేత జట్టు



కారెంపూడి: పల్నాటి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీల విన్నర్స్‌కు శుక్రవారం బహుమతి ప్రదాన కార్యక్రమం గురుకుల పాఠశాలలో జరిగింది. బ్రహ్మనాయుడు సీసీ టీమ్ ఫస్ట్ ప్రైజ్‌ను, వెంగళబాల టీమ్ సెకండ్ ప్రైజ్‌ను, లక్కీ సీసీ టీమ్ మూడవ బహుమతిని పొందారు. విజేతలకు నగదు బహుమతులు, షీల్డ్‌లను దాతలు బండారు శివ, మునుగోటి సత్యం, షేక్ సుభాని, తెలగనేని లక్ష్మయ్య, బి.బాలునాయక్, బండారు వీరేశ్వరరావు, సుంకే అనిల్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, గణితి అమరయ్య, జనసేన మండల అధ్యక్షుడు కేసానుపల్లి కృష్ణబాబు, ఎస్‌ఎంకే నాయుడు, శశి నాయుడు, బద్రి తదితరులు పాల్గొన్నారు.

బాలికలపై నేరాలను అరికడదాం

మాచవరం: నేడు సమాజంలో బాలికలపై జరుగుతున్న వేధింపులు, లైంగిక దాడులు, బాలల అక్రమ రవాణా అరికట్టేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని సెయింట్ ఆన్స్ సిస్టర్ వ్యాకుల మేరీ అన్నారు. స్థానిక జీకే పబ్లిక్ స్కూల్‌లో సెయింట్ లయోలా ప్రేమ నిలయం ఆధ్వర్యంలో బాలికలపై జరిగే అకృత్యాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల అక్రమ రవాణా, భద్రమైన స్పర్శ, అభద్రమైన స్పర్శ, అక్రమ వ్యాపార, లైంగిక దోపిడీ తదితర అంశాలపై బాలికలకు అవగాహన కల్పించారు. నేరాలు, పోక్సో చట్టం గురించి వివరించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. కార్యక్రమంలో పిన్సిపాల్ శ్యాం, సిస్టర్ కవిత, ముండ్లపాటి వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు అక్రమ నిర్మాణాలను తొలగిస్తాం



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని చెరువు స్థలాన్ని ఆక్రమించుకొని నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించి పార్కును నిర్మిస్తామని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా పట్టణంలోని హోసన్న మందిరం వద్ద, ఎస్సీ శ్మశాన వాటిక వద్ద సుమారు రూ.18.32 కోట్లతో మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యరపతినేని హాజరై మాట్లాడుతూ పేద ప్రజలకు ఇళ్లు నిర్మించుకునేందుకు కూటమి ప్రభుత్వం సర్వం సిద్ధం చేస్తుందన్నారు. ప్రతి ఇంటికి కృష్ణా జలాలు అందించేందుకు రూ.135 కోట్లతో పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్‌కుమార్‌రెడ్డి, పబ్లిక్ హెల్త్ చీఫ్ ఇంజనీర్ డి.మరియన్న, పబ్లిక్ హెల్త్ క్వాలిటీ కంట్రోల్ విభాగం సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు, జిల్లా ప్రజారోగ్య సాంకేతిక అధికారి వెంకటేశ్వరరావు, చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, కమిషనర్ పర్వతనేని శ్రీధర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులకు, యాచకులకు దుప్పట్లు పంపిణీ


పిడుగురాళ్ల: నేషనల్ యాంటీ క్రైమ్ అండ్ హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా పల్నాడు శాఖ ఆధ్వర్యంలో మానవ హక్కుల వారోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి వృద్ధులు, యాచకులకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిసెంబర్ 10 తేదీన మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పిడుగురాళ్ల పట్టణంలోని రైల్వే స్టేషన్, క్రోసూరు బస్టాండ్ సెంటర్, ఐలాండ్ సెంటర్‌తోపాటు ప్రధాన కూడలిలో ఉన్న అనాథ వృద్ధులకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పల్నాడు జిల్లా కార్యదర్శి బడిశ మస్తాన్‌రావు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ యాంటీ క్రైమ్ అండ్‌హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇన్‌చార్జి గరికపాటి శంకర్‌రావు, కోటా బాబురావు, కాకుమాను శ్రీనివాసరావు, పాగళ్ల శ్రీనివాసరావు, యడవల్లి శ్రీనివాసరావు, ఆల్లూరి చిన్నబ్బాయి పాల్గొన్నారు.

అర్జీలిస్తే భూ సమస్యలు పరిష్కరిస్తాం



కారెంపూడి: పట్టాదారు పాసుపుస్తకాలు లేనివారికి పట్టాదారు పాసుపుస్తకాలు అందించడంతో పాటు వివిధ రకాల భూ సమస్యలను పరిష్కారం చేసి రైతులను ఆదుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని అర్జీలిస్తే వాటిని పరిష్కరిస్తామని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నరమాలపాడు గ్రామంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామ సభలో రైతుల సమస్యలను ఎమ్మెల్యే తెలుసుకున్నారు. పట్టాదారు పాసుపుస్తకాల కోసం వచ్చిన అర్జీలను స్వీకరించారు. మొత్తం 8 అర్జీలు వచ్చాయని అందులో పట్టాదారు పాసుపుస్తకాల కోసం నాలుగు, భూ సర్వే కోరుతూ నాలుగు అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో ఆర్డీఓ మురళీకృష్ణ, తహసీల్దార్ పుల్లారావు, ఆర్‌ఐ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కష్టాలు డబుల్..!



దాచేపల్లి : ఆర్‌యూబీలో రాకపోకలు బురదమయంగా మారుతున్నాయి. నడికుడి రైల్వేస్టేషన్ సమీపంలో నడికుడి–గోగులపాడు మార్గ మధ్యంలో ఉన్న ఆర్‌యూబీలో నిత్యం మురుగు నీరు ప్రవహిస్తుంది. ఆర్‌యూబీ మీదుగా గోగులపాడు, అలుగుమల్లెపాడు, తక్కెళ్లపాడు, బుధవాడ ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఆర్‌యూబీ సమీపంలో వాగు ఉండటం వలన నీరు ఇక్కడ నిల్వ ఉంటుంది. దీంతో బురదమయంగా ఉన్న నీటిలో నుంచే ప్రజలు రాకపోకలు సాగిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌యూబీ నిర్మిస్తే కష్టాలు తీరయతాయనుకుంటే బురద కష్టాలు ఎక్కువయ్యాయని ప్రజలు వాపోతున్నారు.